RNI. No. APTEL/2011/41055




# ప్రభాత సమాచారం

తెలంగాణ తెలుగు దినపత్రిక




సంపుటి : 12 సంచిక : 256 | ఆదిలాబాద్ | ఎడిటర్ - సయ్యద్ కరీం | బుధవారం, 20 మార్చి 2024 | పేజీలు : 4 | వెల : 2/-

# 'హస్తవాసి' బాగుంది

## బీఆర్ఎస్ అస్తిత్వంపై బలంగా కొడుతున్న తెలంగాణా సీఎం రేవంత్ రెడ్డి!!

## త్వరలో మరో నలుగురైదుగురు ఎమ్మెల్యేలు



హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్రంలో రాజకీయ సమీకరణాలు శరవేగంగా మారుతున్నాయి. గతంలో తెలంగాణ రాష్ట్రంలో ఒక వెలుగు వెలిగిన బీఆర్ఎస్ పార్టీని నిర్వీర్యం చేసే పనిలో ప్రతిపక్ష పార్టీలు ఉన్నాయి.

బీఆర్ఎస్ అధినేత కేసిఆర్ రాజకీయ భవిష్యత్తును ప్రశ్నార్ధకం చేసే పనిలో కాంగ్రెస్ పార్టీ వేస్తున్న అడుగులు, ఆపరేషన్ ఆకర్ష కేసీఆర్ కు షాక్ ఇస్తున్నాయి. ఇప్పటికే బీఆర్ ఎస్ పార్టీ నుండి కాంగ్రెస్ పార్టీలోకి చేరికలను ఆహ్వానిస్తున్న సీఎం రేవంత్ రెడ్డి బీఆర్ఎస్ అస్తిత్వంపై బలంగా దెబ్బ కొడుతున్నారు. లోక్సభ ఎన్నికల నోటిఫికేషన్ వచ్చేలోపు మరో నలుగురు ఐదుగురు కీలక నేతలను పార్టీలో చేర్చుకోవడానికి కాంగ్రెస్ అగ్ర నేతలు వేగంగా చక్రం తిప్పుతున్నారు. బీఆర్ఎస్ పార్టీలో ఎమ్మెల్యేలుగా ఉన్నవారిని కాంగ్రెస్ బాట పట్టించే పనిలో పడ్డారు. ముఖ్యంగా బీఆర్ ఎస్ పార్టీ నుండి కాంగ్రెస్ పార్టీలో చేరే అర్ధ బలం ఉన్నవారిని లోక్సభ బరిలో నిలపాలని కాంగ్రెస్ పార్టీ ఆలోచిస్తుంది.గ్రేటర్ హైదరాబాద్ లో మొన్న జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కేవలం మూడు స్థానాలను మాత్రమే గెలుచుకున్న కాంగ్రెస్ పార్టీ ఈసారి లోక్సభ ఎన్నికలలో అన్ని స్థానాలను కైవసం చేసుకోవడానికి వ్యూహాత్మకంగా ముందుకు వెళుతోంది.

ఈ మేరకు తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి కూడా ప్రకటన చేశారు. రేవంత్ రెడ్డి మాటలు వెనుక పెద్ద వ్యూహం ఉన్నట్టు గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని గులాబీ ఎమ్మెల్యేలను, ముఖ్య బీఆర్ఎస్ నేతలను కాంగ్రెస్ పార్టీలో చేర్చుకునేందుకు రంగ సిద్ధం చేశారని టాక్ వినిపిస్తుంది. ఇప్పటికే చేవెళ్ల ఎంపీ రంజిత్ రెడ్డి, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఇప్పటికే మాజీ మేయర్ మొంతు రామ్మోహన్ పార్టీ లో చేరారు. ఇక ప్రస్తుతం ఎమ్మెల్యేగా ఉన్న మరో ఇద్దరు మాజీ మంత్రులు, మరో ఇద్దరు సీనియర్ ఎమ్మెల్యేలు, తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచిన వ్యక్తి పార్టీలో చేరేందుకు సుముఖత వ్యక్తం చేయగా ఎన్నికల నోటిఫికేషన్ లోపు వీరు చేరికలు ఉంటాయని కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు. మొత్తంగా తెలంగాణ రాష్ట్రంలో లోక్సభ ఎన్నికలలోపే కేసీఆర్ పార్టీకి చెక్ పెట్టే ప్లాన్ లో ఉన్న రేవంత్ రెడ్డి అదును చూసి కేసీఆర్ పైన, బిఆర్ఎస్ పార్టీ అస్తిత్వం పైన బలంగా దెబ్బ కొడుతున్నారు.



## తెలంగాణ గవర్నర్గా సీపీ రాధాకృష్ణన్

తెలంగాణ గవర్నర్ తమిళి సై సౌందర రాజన్ రాజీనామా నేపథ్యంలో కేంద్రం కొత్త గవర్నర్ నియామకాన్ని ప్రకటించింది. జారండ్ గవర్నర్ గా ఉన్న సీపీ రాధాకృష్ణన్ ను కొత్త గవర్నర్ గా అదనపు బాధ్యతలు కట్టబెట్టింది. అలాగే పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ గా కూడా మరో అదనపు బాధ్యత ఇచ్చింది. అలాగే తమిళి సై సౌందర రాజన్ చేసిన రాజీనామాను కూడా ఆమోదిస్తూ నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రస్తుతం లోక్ సభ ఎన్నికల షెడ్యూల్ వెలువడిన నేపథ్యంలో రెగ్యులర్ గవర్నర్లను నియమించే పరిస్థితి లేదు. దీంతో జారండ్ గవర్నర్ కు తెలంగాణ అదనపు బాధ్యతలు అప్పగించారు. 2023 నుంచి జార?ండ్ గవర్నర్ గా ఉన్న సీపీ రాధాకృష్ణన్ గతంలో బీజేపీలో యాక్టివ్ మెంబర్ గా పనిచేశారు. తమిళనాడులోని కోయంబత్తూరు నుంచి రెండుసార్లు ఎంపీగా ఎన్నికయ్యారు. తమిళనాడు బీజేపీ అధ్యక్షుడిగా కూడా పనిచేశారు. దీంతో ఆయన అనుభవాన్ని దృష్టిలో ఉంచుకుని జారండ్ తో పాటు తెలంగాణ, పుదుచ్చేరి బాధ్యతలు కూడా అప్పగించారు. మరోవైపు తెలంగాణ గవర్నర్ గా రాజీనామా చేసిన తమిళి సై సౌందర రాజన్ తమిళనాడు నుంచి లోక్ సభ ఎన్నికల్లో పోటీ చేసేందుకు సిద్ధమవుతున్నారు. చెన్నై లో ఏదో ఒక ఎంపీ సీటు లేదా కన్యాకుమారి, తూత్తుకుడి సీట్లను ఇందుకోసం పరిశీలిస్తున్నారు. త్వరలో దీనిపై స్పష్టత రానుంది. ఇప్పటికే తెలంగాణ గవర్నర్, పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ బాధ్యతలు వదులుకున్న తమిళిసై చెన్నై వెళ్లి రాజకీయ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు.

## సామాజిక వర్గాలవారీగా చీలిన లీడర్లు
## కులాలవారీగా ఆశావహులకు మద్దతు
## బీఆర్ఎస్లోని కమ్మ నేత కోసం బలమైన లాబీయింగ్?
## అయోమయంలో 'జలగం' అనుచరులు




ఖమ్మం: ఖమ్మం లోక్సభ టికెట్పై బీజేపీలో సంకుల సమరం నడుస్తున్నది. సంస్థాగతంగా పెద్దగా బలం లేని ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఆ పార్టీ టికెట్ కోసం నెలకొన్న పోటీ రాజకీయ విశ్లేషకులను సైతం ఆశ్చర్యపరుస్తోంది. ఖమ్మం బీజేపీ టికెట్ కోసం సుమారు పది మంది ఆశావహులు రేసులో ఉండగా, బీఆర్ఎస్కు చెందిన మాజీ ఎమ్మెల్యే జలగం వెంకట్రావు పార్టీలో చేరాక దాదాపు అందరూ ఆశలు వదిలేసుకున్నారు. తీరా హైకమాండ్ ఆయన పేరును ప్రకటించకపోవడంతో ఆశావహులంతా మళ్లీ యాక్టివ్ అయ్యి, తమ ప్రయత్నాలు ముమ్మరం చేశారు. హైదరాబాద్ కేంద్రంగా కులాలవారీగా తమ గాడ్? ఫాదర్ల ను ప్రసన్నం చేసుకోవడం, ఆయా నాయకులు కూడా హామీ ఇస్తుండడం ఆసక్తి రేపుతోంది.

మరోవైపు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఇప్పటికీ జలగం వైపే మొగ్గుచూపుతుండగా, బీఆర్ఎస్ నుంచి ఓ ముఖ్య నేతను లాగేందుకు కమ్మవర్గానికి చెందిన నేతలు ఢిల్లీ స్థాయిలో లాబీయింగ్ చేస్తుండడంతో వెంకట్రావు , ఆయన అనుచరులు అయోమయంలో పడ్డారు.

**సామాజిక వర్గాలవారీగా నేతల మద్దతు :** ఖమ్మం టికెట్? ఆశిస్తున్న వారిలో ఖమ్మం జిల్లా బీజేపీ అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ కమ్మ సామాజికవర్గానికి చెందిన వారు కాగా, ఆయనకు మాజీ రాజ్యసభ సభ్యుడు గరికపాటి మోహన్ రావు మద్దతిస్తున్నారు. కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు రంగా కిరణ్ మున్నూరు కాపు సామాజికవర్గానికి చెందిన వారు కాగా, బీజేపీ సీనియర్ నేత, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్ మద్దతిస్తున్నట్టు టాక్ నడుస్తోంది. 2019 ఎన్నికల్లో పోటీ చేసిన దేవకీ వాసు దేవరావుది ఆర్యవైశ్య సామాజికవర్గం. ఖమ్మం నగరానికి చెందిన డాక్టర్ గోంగూర వెంకటేశ్వర్లు పద్మశాలి సామాజికవర్గానికి చెందినవారు కాగా, ఆయనకు టికెట్ ఇవ్వాలని పొంగులేటి సుధాకర్ రెడ్డి కోరుతున్నట్టు తెలుస్తోంది. అయితే వెలమ సామాజికవర్గానికి చెందిన తాండ్ర వినోద్ రావుకు టికెట్ ఇవ్వాలని ఈటల రాజేందర్, ఇటీవల పార్టీలో చేరిన మాజీ ఎమ్మెల్యే జలగం వెంకట్రావు (వెలమ)కు టికెట్ ఇవ్వాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి కిషన్ రెడ్డి పట్టుబడుతున్నట్టు సమాచారం.


ఇక బీజేపీ సీనియర్ నేత, కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఈవీ రమేశ్(గౌడ్) టికెట్ కోసం తీవ్ర ప్రయత్నాలే చేస్తున్నారు.

**ఢిల్లీ స్థాయిలో లాబీయింగ్?..** రాష్ట్రంలో బీజేపీ ఇప్పటి వరకు ప్రకటించిన వారిలో ఒక్క కమ్మ అభ్యర్థికి కూడా లేదని, ఖమ్మం టికెట్ ఎలాగైనా కమ్మ సామాజికవర్గానికి ఇవ్వాలంటూ బీజేపీలో డిమాండ్లు వినిపిస్తున్నాయి. బీజేపీ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ టికెట్ రేసులో ఉండగా, అదే సామాజికవర్గానికి చెందిన మరో ముఖ్య నేత కోసం కమ్మ సామాజికవర్గానికి చెందిన రాష్ట్ర నేతలు ప్రయత్నిస్తున్నట్టు తెలుస్తోంది.

ప్రస్తుతం బీఆర్ఎస్లో ఉన్న ఆ లీడర్కు టికెట్ ఇప్పించేందుకు మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు ద్వారా ఢిల్లీ స్థాయిలో మంతనాలు సాగిస్తున్నట్టు సమాచారం. ఆయనకు పార్టీలో రూట్ క్లియర్ చేసేందుకే ఇంకా ఖమ్మం టికెట్ పెండింగ్ పెట్టారన్న టాక్ నడుస్తోంది.

# 'కారు' ఖాళీ అవుతోంది!

## అయోమయంలో బీఆర్ఎస్ కేడర్




## కేసీఆర్ ఊహకందని 'రేవంత్ రాజకీయం'

హైదరాబాద్ : కుడిఎడమైతే పొరబాటు లేదోయ్ ఓడిపోలేదోయ్ అన్నాడు ఓ మహాకవి.. అయితే ఆ మాటలు రాజకీయాల్లో అస్సలు పనికిరావు. రాజకీయాల్లో కుడిఎడమైతే, ఓటమిపాలైతే ఆ తర్వాత వచ్చే ఇబ్బందులు అన్ని ఇన్ని కావు. ఇప్పుడు సరిగ్గా అటువంటి దారుణమైన పరిస్థితులను ఎదుర్కొంటున్నారు బీఆర్ఎస్ అధినేత కేసిఆర్. గత పది ఏళ్లుగా తెలంగాణ రాష్ట్రాన్ని ఏకచిత్రాధిపత్యం కింద పాలించిన ఆయన.. తన మాటే శాసనం అంటూ పార్టీని నడిపించిన కేసీఆర్ ఇప్పుడు పార్టీలో నుండి వలసలు వెళుతున్న వారిని ఆపలేకపోతున్నారు. స్వయంగా బుజ్జగించినా, బతిమాలినా నేతలు వినకపోవడం కాంగ్రెస్, బిజెపిల వైపు చూడడం ప్రస్తుతం కెసిఆర్ దయనీయ పరిస్థితికి అద్దం పడుతుంది. దేశ్ కి నేతగా దేశ రాజకీయాలు చేస్తానని చెప్పిన కేసీఆర్ గత ఎన్నికలలో ఓటమి పాలు కావడంతో ప్రస్తుతం రాష్ట్రంలో రాజకీయాలనే చేయలేకపోతున్నారు. ప్రస్తుతం లోక్సభ ఎన్నికల్లోనైనా సత్తా చాటాలని ప్రయత్నం చేస్తున్న ఆయన పోటీ చేయడానికి పార్టీ నేతలు విముఖత చూపుతున్న క్రమంలో ఖంగు తింటున్నారు .తన వాళ్ళు ఎవరో, కాని వాళ్ళు ఎవరో అర్థం చేసుకోలేక కెసిఆర్ ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికే పెద్దపల్లి లోక్సభ టికెట్ ఆశిస్తూ సిట్టింగ్ ఎంపీ బోర్లకుంట వెంకటేష్ నేత కాంగ్రెస్ గూటికి చేరుకున్నారు. ఇక సికింద్రాబాద్ లోక్సభ టికెట్ కోసం మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, ప్రస్తుత డిప్యూటీ మేయర్ శ్రీలత భర్త మోతే శోభన్ రెడ్డి కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. చేవెళ్ల టిక్కెట్ కోసం మాజీ మంత్రి మహేందర్ రెడ్డి దంపతులు కాంగ్రెస్ బాట పట్టారు. ఇక ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుండి మాజీ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే విట్టల్ రెడ్డి కూడా కాంగ్రెస్ కు దగ్గరవుతున్నారు. మాజీ మంత్రి మల్లారెడ్డి తాజాగా కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ తో భేటీ అయ్యారు. ఇక నాగర్ కర్నూల్ సిట్టింగ్ ఎంపీ పీ రాములు, జహీరాబాద్ సిట్టింగ్ ఎంపీ బీబీ పాటిల్ బిజెపి తీర్థం పుచ్చుకున్నారు. మాజీ ఎంపీలు గోడెం నగేష్, సీతారాం నాయక్, నల్గొండ మాజీ ఎమ్మెల్యే సైదిరెడ్డికి పార్టీలో చేరిన వెంటనే అభ్యర్థులుగా పోటీ చేసే అవకాశం దక్కింది. ఇక ప్రస్తుతం ఆరూరి రమేష్ కూడా కేసీఆర్ బుజ్జగించినా బిజెపి బాట పట్టారు. ఇలా రాష్ట్ర వ్యాప్తంగా అని నియోజకవర్గాలలోను బీఆర్ఎస్ నేతలు వలసల బాట పట్టడం బీఆర్ఎస్ అధినేత కేసిఆర్ ఊహించని పరిణా మం. దీంతో ప్రస్తుతం కొనసాగుతున్న వలసల నేపథ్యంలో కారు ఖా ళీ అయిపోతుంది. మరి ఈ పరిస్థితులను అధిగమించి పార్టీని ముందుకు నడిపించడానికి గులాబీ బాస్ కింకర్తవ్యం ఏమిటన్నది కాలమే నిర్ణయించాలి.

## సంపాదకీయం

ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక

# సీఎం కాదు...పోటీ చేసే సీటు ఎక్కడ చెల్లెమ్మా...!?

సీఎం పదవిలో షర్మిలను కూర్చోబెట్టేవరకూ అండగా ఉంటాను అని తెలంగాణా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విశాఖ సభలో ప్రకటించారు. ఆయన ప్రకటనతో షర్మిల మొహంలో ఆనందం కనిపించింది. కానీ సీఎం పదవి అంత సులువుగా వస్తుందా అన్నదే చర్చ. ఆ పదవి కోసం షర్మిల సోదరుడు జగన్ పదేళ్ల పాటు నానా రకాలైన కష్టాలు పడ్డారు. ప్రజలకు చేరువ కావడానికి ఆయన ఎన్నో రకాలైన కార్యక్రమాలు నిర్వహించారు. ఆయన ఎన్నికలలో పోటీ చేసి రెండు సార్లు ఎంపీగా రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. ఇక వైఎస్సార్ అయితే మూడు దశాబ్దాల పాటు వేచి చూస్తే తప్ప సీఎం పదవి ఆయనకు దక్కలేదు. దాని కోసం ఆయన మండుటెండలో చేవెళ్ళ నుంచి ఇచ్చాపురం దాకా భారీ పాదయాత్రను నిర్వహించారు. ఇదిలా ఉంటే వైఎస్ షర్మిల రాజకీయంగా ఇంకా నిరూపించుకోవాల్సి ఉంది అని అంటున్నారు. ఆమె తెలంగాణాలో పార్టీ పెట్టారు. అది మూడేళ్ల లోపే కాంగ్రెస్ లో విలీనం చేశారు. తెలంగాణాలో 2023లో జరిగి న ఎన్నికల్లో ఆమె పోటీ చేయలేదు. ఆమె ఇపుడు ఏపీసీసీ ప్రెసిడెంట్ అయ్యారు. మే 13న ఏపీలో ఎన్నికలు ఉన్నాయి. షర్మిల ఎంపీగా పోటీ చేస్తారా లేక ఎమ్మెల్యేగా చేస్తారా అన్నది ఇంతవరకూ తెలియలేదు. ఆమె ఓటు హైదరాబాద్ లో ఉంది అని అంటున్నారు. ఆమె పోటీ చేయాలంటే ఓటు మార్పించుకోవాలా అన్నది కూడా చర్చగా ఉంది. ఇక ఆమె పోటీ చేస్తే ఏ సీటులో అన్నది మరో చర్చగా ఉంది. సొంత నియోజకవర్గం పులివెందులలో కాంగ్రెస్ నుంచి ఆమె పోటీ చేసి అన్న, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ని ఢీ కొడతారా అన్నది కూడా టాక్ నడుస్తోంది. అలా కాదు అనుకుంటే కడప ఎంపీ సీటుకు పోటీ పడతారా అన్నది మరో ప్రశ్నగా ఉంది. అక్కడ సిట్టింగ్ ఎంపీ అవినాష్ రెడ్డిని ఓడించాలీ అంటే షర్మిల అయినా సునీత అయినా పోటీలో ఉండాల్సి ఉంది. ఏపీలో కాంగ్రెస్ తీరు చూస్తే నోటా కంటే ఓట్లు తక్కువగా ఆ పార్టీకి వచ్చాయి. ఈసారి ఏమైనా పెరుగుతాయా అన్నది చూడాలి తప్ప సీట్లు ఎన్ని గెలుస్తుంది అన్నది లెక్క వేయకూడదు అనే వారూ ఉన్నారు. రేవంత్ రెడ్డి తన స్పీచ్ లో పాతిక ఎమ్మెల్యే సీట్లు ఇస్తే చాలు అన్నట్లుగా మాట్లాడారు. అంటే ఏపీలో కాంగ్రెస్ కి అధికారం మీద ఆశ లేదు తమకు ఆ సీన్ లేదని చెప్పేశారా అన్న చర్చ సాగుతోంది. మరి అధికారం కావాలని మొత్తం 175 సీట్లకు పోటీ చేస్తే జనాలు కనీసం ఈ వైపు అయినా చూస్తారు తప్ప పాతిక సీట్లకు కాంగ్రెస్ పెద్దలే తగ్గిపోతే జనాలు ఎలా ఆలోచిస్తారు అన్నది కూడా చర్చగానే ఉంది. ఇక సీఎం షర్మిల అని రేవంత్ రెడ్డి అంటున్నారు. పాతిక సీట్లు వస్తే ఆమె ఎలా సీఎం అవుతుందని ప్రత్యర్ధులు అంటున్నారు. ఇంతకీ షర్మిల ఈ ఎన్నికల్లో పోటీ చేస్తారా లేదా అన్నదే అతి పెద్ద ప్రశ్న. పోటీ చేస్తే కచ్చితంగా గెలవాలి. అది ఆమె రాజకీయ జీవితానికి పెద్ద సవాల్ అని అంటున్నారు. మొత్తం 175 సీట్లలో షర్మిల అయినా గెలిస్తేనే కాంగ్రెస్ కి ఆ ఊపు ఉంటుంది. లేకపోతే వైఎస్సార్ వారసురాలు వచ్చినా కాంగ్రెస్ లేవలేదు బతికి బట్టకట్టలేదు అన్న విమర్శలు వస్తాయి. అంతే కాదు ఆమె పీసీసీ చీఫ్ పదవికి కూడా అవి ముప్పుగా మారుతాయని అంటున్నారు. ఏది ఏమైనా మంచి ఎమ్మెల్యే సీటు చూసుకుని పోటీ చేయాలి చెల్లెమ్మ అని సూచనలు వస్తున్నాయి.

# నగారాతో గరం.. గరం



ఆదిలాబాద్ : పార్లమెంటు ఎన్నికలకు నగారా మోగడంతో రాజకీయం వేడెక్కింది. శ్రేణులను ఏకతాటిపైకి తెచ్చి ఆదిలాబాద్ పార్లమెంటు స్థానంపై జెండా ఎగురవేసేందుకు మూడు ప్రధాన పార్టీలు దృష్టి సారించాయి. ఇప్పటికే భాజపా, భారాస అభ్యర్థులను ప్రకటించగా కాంగ్రెస్ గెలుపు గుర్రం కోసం అన్వేషిస్తోంది. శాసనసభ ఎన్నికల తర్వాత రాష్ట్రంతోపాటు ఉమ్మడి జిల్లాలో రాజకీయ సమీకరణాల్లో స్పష్టమైన మార్పు కనిపిస్తుండటంతో ఓటర్ల ప్రాధాన్యం మరింత పెరుగుతోంది. ఏడు శాసనసభ నియోజకవర్గాలతో విస్తరించి ఉన్న ఆదిలాబాద్ ఎంపీ సీటు పరిధిలో ప్రస్తుతానికి 16,44,715 ఓటర్లున్నట్లు జిల్లా యంత్రాంగం నిర్ధారించింది. ఇందులో పురుషుల కంటే మహిళా ఓటర్లే ఎక్కువగా ఉన్నారు. మహిళా ఓటర్లు 8,42,054 మంది ఉంటే పురుష ఓటర్లు 8,02,575 మంది, మరో 86మంది ఇతరు ఉన్నట్లు జిల్లా యంత్రాంగం తేల్చింది. ఎంపీ అభ్యర్థుల నామపత్రాల దాఖలు వరకు అర్హులైన వారు కొత్తగా ఓటుహక్కు నమోదు చేసుకోవడానికి అవకాశం ఉంది.

పార్టీలు అప్రమత్తం

రాజకీయం క్రమంగా వేడెక్కుతోంది. ఎస్టీ రిజర్వు స్థానం అయినందున భాజపా, భారాస ఆదివాసీ అభ్యర్థులకు ప్రాధాన్యమివ్వడంతో కాంగ్రెస్ వైఖరి ఎలా ఉంటుందనే దానిపై అందరి దృష్టి కేంద్రీకృతమై ఉంది. భాజపా తరఫున గోడం నగేష్, భారాస నుంచి ఆత్రం సక్కు అభ్యర్థిత్వాలు ఖరారైన విషయం విదితమే. కాంగ్రెస్ టికెట్ కోసం పోటీ నెలకొనడంతో ఆదివాసీ అభ్యర్థులకు ప్రాధాన్యమిస్తారా? లేక లంబాడీలకు అవకాశం కల్పిస్తారా? అనేది కీలకంగా మారింది. కాంగ్రెస్ అధిష్ఠానం తాజాగా వెడ్మ బొజ్జు, ప్రొఫెసర్ సుమలత, ఆత్రం సుగుణ, రేఖానాయక్, నరేష్ జాదవ్, శ్రవణ్‌నాయక్ పేర్లను పరిశీలిస్తున్నట్లు పార్టీలో ప్రచారం జరుగుతోంది. ఒకవేళ మహిళలకు టికెట్ ఇవ్వాలనుకుంటే సుమలత, ఆత్రం సుగుణ, రేఖానాయక్‌లో ఒకరికి అవకాశం కల్పించాలని చూస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. భాజపా, భారాస ఆదివాసీ తెగ అభ్యర్థులను బరిలో నిలిపినందున కాంగ్రెస్ తరఫున లంబాడీలను పోటీలో నిలపాలనే అంశం తెరమీదకు వచ్చినట్లు తెలుస్తోంది. పీసీసీ మాత్రం ఆదివాసీ అభ్యర్థులవైపే మొగ్గుచూపుతున్నట్లు తెలుస్తోంది. భాజపా, భారాసలో అసంతృప్తులకు లోనైన కీలక నేతల మద్దతు కూడగట్టేందుకు కాంగ్రెస్ పావులు కదుపుతోంది.

భాజపాలో రెబల్?

భాజపా టికెట్ కోసం చివరి నిమిషం వరకు ప్రయత్నించిన కొంతమంది నేతలు మోదీ ఫొటోతో తిరుగుబాటు అభ్యర్థిగా పోటీ చేస్తే ఎలా ఉంటుందనేదానిపై సమాలోచనలు చేస్తుండటం చర్చనీయాంశంగా మారింది. ప్రధానంగా మాజీ ఎంపీ రమేష్ రాఠోడ్, ఆదిలాబాద్ జడ్పీ ఛైర్మన్ జనార్దన్ రాఠోడ్, బోథ్ మాజీ ఎమ్మెల్యే రాఠోడ్ బాపురావు లేదంటే ఎంపీ సోయం బాపురావును తిరుగుబాటు అభ్యర్థిగా నిలపాలని కొంతమంది రహస్యంగా సమాలోచనలు చేసినా స్పష్టత రాలేదు.

# అధ్వాన.. ఆవాసాలు!



ఆసిఫాబాద్: గూడు లేని నిరుపేదల కోసం నిర్మిస్తున్న ఇళ్లు ఏళ్ల తరబడి అసంపూర్తిగానే ఉంటున్నాయి. కిటికీలు, తలుపులు, ఫ్లోరింగ్ లేక అసంపూర్తిగా ఉన్న ఇళ్లల్లోనే లబ్ధిదారులు నివసిస్తూ అనేక అవస్థలు పడుతున్నారు. రెండు పడక గదులకు కేటాయించిన నిధులకన్నా ఎక్కువ ఇచ్చినా గుత్తేదారులు పనులు చేయడంలో తాత్సారం చేస్తున్నారు. మరోవైపు రూ.కోట్ల విలువైన పనులను కొందరు అధికారులు, నేతలు తమకు నచ్చిన గుత్తేదారులకు అప్పగించారనే విమర్శలు ఉన్నాయి. టెండర్ నిర్వహించకుండానే చేపడుతున్న పనులు మొక్కుబడిగా సాగుతున్నాయని లబ్ధిదార్లు వాపోతున్నారు.

గిరిజనుల్లో అత్యంత వెనుకబడిన తెగ.. కొలాంలకు 30 వరకు ప్రీ ఫ్యాబ్రికేటెడ్ ఇళ్లను ఐటీడీఏ అధికారులు నిర్మించారు. ఒక్కో ఇంటికి రూ.3.50 లక్షల చొప్పున మొత్తం రూ.1.05 కోట్లు ఖర్చు చేశారు. మరో 300 వరకు ఇళ్లు మంజూరైనా, అప్పటికే పూర్తయిన వాటిని చూసిన వీరు, కొత్త వాటిని నిర్మిస్తే ఉండమని అధికారులకు తేల్చి చెప్పారు. ఈ నేపథ్యంలో సిమెంటు గోడలతో ఇళ్లు నిర్మించి, పైన రేకులు వేయాలని అధికారులు తీర్మానించారు. రూ.లక్ష తగ్గించి కేవలం రూ.2.50 లక్షలు మాత్రమే ఈ గృహాలకు కేటాయించారు. అత్యంత పేదవారైన గిరిజనులకు ఇళ్లు కట్టుకునే స్తోమత ఉండదు. ఈ నేపథ్యంలో గుత్తేదారులు రంగప్రవేశం చేసి జిల్లా వ్యాప్తంగా 300 పైచిలుకు ఇళ్లను నిర్మిస్తున్నారు. వీటికోసం రూ.10.50 కోట్లు ఖర్చు ఐటీడీఏ అధికారులు కేటాయించారు.

బిల్లులు లేవు..

ఒక్కో ఇంటికి రూ.2.50 లక్షలు మాత్రమే కేటాయించడంతో గుత్తేదారులు పనులను అధ్వానంగా చేస్తున్నారు. స్థానిక వాగుల్లో దొరికే ఇసుకను తెచ్చి, నాసిరకం ఇటుకలను ఎక్కువగా వాడుతున్నారు. జిల్లా వ్యాప్తంగా నిర్మిస్తున్న ఈ ఇళ్లు ప్రస్తుతం తుది దశకు చేరుకున్నాయి. కొన్నిచోట్ల ఇళ్లను లబ్ధిదారులే కట్టుకుంటున్నారు. ఐటీడీఏ అధికారులు నయాపైసా విడుదల చేయకపోవడంతో.. అప్పులు చేసి ఇళ్లు కట్టుకున్న లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా అధికారులు వివరాలు, నివేదికలన్నీ ఐటీడీఏ పీఓకు సమర్పించినా.. నిధుల విడుదలలో జాప్యం జరుగుతోందని సమాచారం.

మూడేళ్లుగా..

కాగజ్‌నగర్ మండలంలోని కొలాంగోంది గ్రామంలో 16 కుటుంబాలు అడవిలోనే నివాసం ఏర్పర్చుకున్నాయని మూడేళ్ల కిందట ఆసిఫాబాద్ మండలం సాలేగూడలో వారికి పునరావాసం కల్పించారు. రెండు పడక గదుల ఇళ్లు మంజూరు చేయగా, గుత్తేదారులు ఎవరూ ముందుకు రాకపోవడంతో.. ఓ నేత పనులను ప్రారంభించారు. ఒక్కో ఇంటికి రూ.5.04 లక్షలు కేటాయించగా.. నిధులు సరిపోవడం లేదని అధికారులకు చెప్పడంతో మరో రూ.1.25 లక్షలు కేటాయించారు. రూ.6.29 లక్షలు ఖర్చు చేసినా ఇళ్లన్నీ అసంపూర్తిగానే ఉన్నాయి. కిటికీలు, తలుపులు లేకుండా గుత్తేదారు వాటిని అలాగే వదిలేశారు. వారు అవే ఇళ్లల్లో ఉంటున్నారు. ఇంటి లోపల ఫ్లోరింగ్ సైతం లేదు. మరుగుదొడ్లు, మూత్రశాలల ఊసే లేదు.

ఫ్లోరింగ్ చేయాలి

మడావి అనిత, సాలేగూడ, ఆసిఫాబాద్

మూడేళ్ల నుంచి అయిదుగురు కుటుంబ సభ్యులతో కలిసి ఇంట్లో ఉంటున్నాం. ఇంతవరకు ఫ్లోరింగ్ చేయలేదు. కిటికీలు, తలుపులు లేకపోవడంతో వర్షాకాలంలో తీవ్ర అవస్థలు పడుతున్నాం.

కిటికీలు లేవుసిడాం మోతుబాయి, సాలేగూడ

ఫ్లోరింగ్ చేసుకోవడానికి రూ.15 వేలు ఖర్చు చేశాం. తలుపులు మేమే కొనుక్కున్నాం. కిటికీలు బిగించలేదు. వర్షం వస్తే నీళ్లన్నీ ఇంట్లోకి వస్తున్నాయి. అధికారులు కిటికీలు ఏర్పాటు చేయాలి.

# యాదికొస్తోంది.. ఇంకుడు గుంత

బోధన్ :వేసవిలో తాగునీటి ఎద్దడి ముప్పు ముంచుకొస్తోంది. ఇప్పటినుంచే అప్రమత్తమై తగిన చర్యలు తీసుకోవాలి అని హైకోర్టు ప్రభుత్వానికి ఇటీవల ఆదేశాలు జారీ చేసింది. జల సంరక్షణ చర్యలు చేపట్టని పక్షంలో హైదరాబాద్ నగరం కూడా మరో బెంగళూరులా మారి నీటికి కటకట ఏర్పడుతుందని హెచ్చరించింది. అలాగే నీటి సంరక్షణపై తీసుకోవాల్సిన చర్యలను సూచించింది. నీటి ఎద్దడిపై గతంలో దాఖలైన ఒక వ్యాజ్యంపై విచారణ సందర్భంగా హైకోర్టు పలు అంశాలు ప్రస్తావించింది.

అమలుకాని నిబంధనలు..కోర్టు ప్రస్తావించిన అంశాల్లో ఇంకుడు గుంతలు, వాల్టా చట్టం అమలు, మొక్కల పెంపకం ప్రధానంగా ఉన్నాయి. వీటిపై పలు సూచనలు చేసింది. అవి రాష్ట్రంలోని గ్రామీణ, పట్టణ స్థానిక సంస్థలన్నింటికీ వర్తిస్తాయి. ఈ మేరకు ఇప్పటికే రూపొందించిన చట్టాలు, నిబంధనల అమలుపై జిల్లాస్థాయిలో సమీక్ష నిర్వహించాల్సిన అవసరముంది. వాస్తవానికి భవన నిర్మాణాల్లో నిర్దేశించిన నిబంధనలెక్కడా అమలుకు నోచుకోవడంలేదు. దీనిపై అధికార యంత్రాంగం ఉదాసీనంగా వ్యవహరిస్తున్నాయి. దీంతో విచ్చలవిడిగా బోర్ల తవ్వకాలు, ఇంకుడు గుంతలు నిర్మించకుండానే భవన నిర్మాణాలు చేపట్టడం, మొక్కల పెంపకాన్ని విస్మరించడం వంటివి సర్వసాధారణమయ్యాయి. ఆపదొచ్చినప్పుడు హడావుడి చేయకుండా జల సంరక్షణపై అధికారులు, పాలకులు, చిత్తశుద్ధితో వ్యవహరించాల్సిన తరుణమిది.

నిర్మించేవారు 10శాతంలోపే..గతంలో పట్టణ ప్రణాళిక శాఖ జారీ చేసిన ఉత్తర్వు ప్రకారం భవన నిర్మాణదారు ఇంకుడు గుంత నిర్మించడం, 15 చెట్లు నాటడం తప్పనిసరి. ఈ బాధ్యత విస్మరించకూడదని ధరావతు నిబంధన పెట్టారు. ఇంకుడు గుంత నిర్మించినట్లు చూపిస్తే ఈ సొమ్ము తిరిగి ఇస్తారు. కానీ గుంత నిర్మాణ వ్యయంతో పోలిస్తే డిపాజిట్ రుసుము తక్కువగా ఉండటంతో ఎవరూ పెద్దగా ఆసక్తి చూపడం లేదు. ధరావతుతో వచ్చిన సొమ్మును బల్దియా అధికారులు బహిరంగ ప్రదేశాల్లో, అక్కడక్కడ ఇంకుడు గుంతల నిర్మాణానికి వెచ్చించాలనే నిబంధన ఉంది. కానీ అమలుకు నోచుకోవడం లేదు. నిజామాబాద్‌లో ఇటీవల 147.71 చదరపు మీటర్ల స్థలంలో నిర్మించ తలపెట్టిన భవనానికి రూ.3692.75 ఇంకుడు గుంత రుసుము వసూలు చేశారు. వాస్తవానికి గుంత నిర్మాణానికి దాదాపు రూ.10వేల వరకు వ్యయమవుతుందనే వాదన ఉంది.

# అడుగంటిన జలం.. తీరని దాహం

చేర్యాల : గతేడాదితో పోల్చుకుంటే ఈసారి ఎండల తీవ్రత అధికంగా ఉండడంతో భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి. ఫలితంగా జిల్లా కేంద్రం మెదక్‌తోపాటు నర్సాపూర్, రామాయంపేట, తూప్రాన్ పురపాలికల్లో నీటి ఎద్దటి మొదలైంది. మెదక్ పట్టణంలోని పిల్లికొట్టాల్ రెండు పడగ గదుల ఇళ్ల కాలనీలో 10 రోజులుగా నీటి సరఫరాలో హెచ్చుతగ్గులుండడంతో స్థానికులు ఆందోళనకు దిగారు. శివారు ప్రాంతాలు, విలీన గ్రామాల్లో నీటి సమస్యలు ప్రారంభయ్యాయి. నర్సాపూర్, తూప్రాన్, రామాయంపేట పురాల్లోనూ ఇలాంటి పరిస్థితులే ఉన్నాయి.

పైపులు ధ్వంసం.. వృథాగా నీరు

జిల్లా కేంద్రం మెదక్ పట్టణంలో ఇంటింటికీ తాగునీరు అందించేందుకు చేపట్టిన జలజాలం పనులపై సంబంధిత అధికారుల పర్యవేక్షణ కరవైంది. నాణ్యత లోపించి పట్టణంలో పలుచోట్ల అంతర్గత పైపులు ధ్వంసమయ్యాయి. దీంతో నీరు వృథాగా పోతోంది. లీకేజీలు ఏర్పడిన ప్రాంతాల్లో మరమ్మతులు చేయలేదు. పట్టణ శివారు, దూరప్రాంతాలు, ఎత్తయిన కాలనీల్లో నీటి సరఫరాలో హెచ్చుతగ్గులు అవుతుండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దీనికితోడు మరికొన్ని ప్రాంతాల్లో ఇళ్లకు సరఫరా అయ్యే నల్లాలకు మూతలు బిగించి వృథా నీటిని అరికట్టాలని ప్రతి పురపాలిక సమావేశంలో కౌన్సిలర్లు సభ దృష్టికి తీసుకొచ్చినా అధికారులు మాత్రం క్షేత్రస్థాయిలో అమలు చేయడం లేదన్న ఆరోపణలున్నాయి.

పురపాలికలో వేసవి ప్రారంభంలోనే నీటి ఇబ్బందులు తీవ్రమయ్యాయి. జనాభా అవసరాలకు అనుగుణంగా మిషన్ భగీరథ నీటిని సరఫరా చేయడం లేదు. దీంతో నల్లాల వద్ద ప్రజలు పడిగాపులు కాస్తున్నారు. గతేడాది వర్షాలు సమృద్ధిగా కురవడంతో భూగర్భ జలాలు వృద్ధి చెందాయి. మంజీరాలోనూ నీరు పుష్కలంగా ఉండటంతో ఆటంకాలు ఏర్పడలేదు. చక్రియాల ఇన్‌టెక్ వెల్ వద్ద, పైప్‌లైన్ల లీకేజీల మరమ్మతుల పేరుతో అధికారులు రోజుల తరబడి సరఫరా నిలిపివేస్తుండగా సమస్యలు ఎదురవుతున్నాయి. మంజీరాపై ఆశలు పెట్టుకొని సింగిల్‌ఫేజ్ బోర్ల వాడకం తగ్గించారు. ప్రస్తుతం ఇబ్బందులు తీవ్రం కావడంతో మళ్లీ వాడక తప్పని పరిస్థితులు నెలకొన్నాయి. 4, 5, 6, 8, 9, 10వ వార్డులకు ట్యాంకులను గతేడాది ప్రతిపాదించారు. నేటికీ పూర్తి కాలేదు. 2, 5వ వార్డుల్లో నీటి ఇబ్బందులు తీవ్రం కావడంతో కొత్తగా రెండు బోర్లు తవ్వించారు.

పలు వార్డుల్లో అరకొర సరఫరా

పురపాలికలో కొన్ని వార్డుల్లో నీటి సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కొత్త కాలనీల్లో సరఫరా అరకొరగా ఉంటోంది. వేసవి కాలం సమీపిస్తున్న తరుణంలో పట్టణంలోని 4, 13, 15, 16వ వార్డుల్లో కొంత మేర నీటి సమస్యలు తలెత్తుతున్నాయి. కొన్నిసార్లు ఉదయం, సాయంత్రం నీటి సరఫరా చేసినా సరిపోవడం లేదని పట్టణ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సమస్యలు పరిష్కరిస్తాం..

– రమేష్, అదనపు పాలనాధికారి స్థానిక సంస్థలు

వేసవిలో నీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఇటీవలే ఆదేశాలిచ్చాం. దీంతోపాటు నీటి వృథాను అరికట్టేందుకు త్వరలో పురపాలిక అధికారులతో సమావేశం ఏర్పాటు చేస్తాం. నీటి ఎద్దటి తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకుంటాం.

కుళాయిలకు బిరడాలూ కరవే..రామాయంపేట: పట్టణంలోని 12 వార్డుల్లో గతంలో భగీరథలో భాగంగా ఏర్పాటు చేసిన నీటి కొళాయిలకు పూర్తిస్థాయిలో బిరడాలూ బిగించలేదు. కొన్ని కాలనీల్లో ఉదయం నీటి సరఫరా చేస్తున్నారు. మరికొన్నింటికి సరఫరా చేస్తున్నారు. సింగిల్‌ఫేజ్ మోటార్ల ద్వారా సైతం నీరు సరఫరా చేస్తున్నారు. భగీరథ నీరు పట్టుకున్న అనంతరం వాటికి బిరడాలు బిగించకపోవడంతో వృథాగా పోతోంది. ప్రజలు వృథాను అరికడితే ఎద్దడి నుంచి ఉపశమనం లభిస్తుందని అంటున్నారు.

# చెక్ పవర్ సమస్యకు పరిష్కారం

చేర్యాల : ప్రభుత్వ పాఠశాలల నిర్వహణకు యాజమాన్య కమిటీలు (ఎస్ఎంసీ) తమవంతు సహకారాన్ని అందించేవి. వీటి గడువు పూర్తవడంతో అప్పటి ప్రభుత్వం గతేడాది డిసెంబరులో వీటిని రద్దు చేసింది. ప్రస్తుతం ఆర్థిక సంవత్సరం మార్చినెలాఖరుతో పూర్తికానుండటం, విద్యాసంవత్సరం చివరి దశలో ఉండటంతో తాత్కాలికంగా ఉపాధ్యాయులకు జాయింట్ చెక్‌పవర్‌కు అవకాశం కల్పించింది. కమిటీలు లేక మూడు నెలల నుంచి పాఠశాల గ్రాంట్ల వినియోగానికి సమస్యలు తలెత్తుతున్నాయి. దీన్ని గమనించిన విద్యాశాఖ.. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, సీనియర్ ఉపాధ్యాయుడికి సంయుక్తంగా, ఏకోపాధ్యాయ పాఠశాలలున్న చోట్ల స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎంలను జత చేస్తూ చెక్‌పవర్ కల్పించింది. ఈ మేరకు ఉత్తర్వులను విద్యాశాఖ ఇటీవల జారీ చేసింది.

నిధులు వినియోగానికి..

ఉమ్మడి మెదక్‌లో 3,463, వికారాబాద్‌లో 1030 పాఠశాలలు ఉన్నాయి. గతేడాది అప్పటి ప్రభుత్వం ప్రారంభించిన 'మన ఊరు– మన బడి' పథకం పనులన్నీ ఎస్ఎంసీల పర్యవేక్షణలోనే కొనసాగాయి. పలు చోట్ల నిర్మాణ పనులు పూర్తిచేసి ప్రారంభించారు. మరికొన్ని చోట్ల కొనసాగుతుండగా.. గుత్తేదారులకు ఇటీవల చెల్లింపులు నిలిచిపోవడంతో అవి కాస్త నిలిచిపోయాయి. ఎస్ఎంసీల రద్దుతో వివిధ రకాల గ్రాంట్లు మంజూరైనా వినియోగించుకునే వెసులుబాటు లేకుండా పోయింది. మార్చి నెలాఖరుతో ఆర్థిక సంవత్సరం ముగియనుండటంతో బిల్లుల డ్రా విషయంలో ఇబ్బందులు తలెత్తకుండా చెక్ పవర్ విషయంలో నిర్ణయం తీసుకుంది.




బకాయిలు లేకుండా..ప్రభుత్వ తాజా నిర్ణయంతో ఆయా సమస్యలకు పరిష్కారం దొరికింది. మరోవైపు విద్యాశాఖ ఆదర్శ అమ్మ కమిటీల ఏర్పాటుకు చర్యలు చేపట్టింది. వీటికే ఎస్ఎంసీల బాధ్యతలను సైతం అప్పగించనున్నారు. ఈ కమిటీల ఎంపిక పూర్తయి, నిర్వహణలోకి వచ్చేవరకు జాయింట్ చెక్ పవర్ అమల్లో ఉంటుంది. మార్చిలో ఎలాంటి బకాయి బిల్లు లేకుండా ఉండేందుకు ఇది ఉపయోగపడుతుంది. ఈ మేరకు విద్యాశాఖ అధికారులు హెచ్‌ఎం, సీనియర్ ఉపాధ్యాయులకు సంబంధించిన జాయింట్ బ్యాంకు ఖాతాలు తెరిచేందుకు సన్నాహాలు చేపట్టారు.

తాజాగా ఉత్తర్వులు..: రాధాకిషన్, మెదక్ డీఈవో

పాఠశాలల్లో నిధుల డ్రా విషయంలో సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు జాయింట్ చెక్‌పవర్‌కు అవకాశం కల్పిస్తూ ఉత్తర్వులు అందాయి. ఖాతాలు తెరిచే ప్రక్రియ చేపట్టాం. నిర్మాణ, అభివృద్ధి పనులకు సంబంధించి బిల్లులు జాప్యం లేకుండా చెల్లించే వీలుంది.

# దారి తప్పిన.. స్వచ్ఛ ఆటోలు

హైదరాబాద్: స్వచ్ఛ ఆటోల సేవలు దారి తప్పుతున్నాయి. ఆటోతోపాటు ఇళ్లను కేటాయించేందుకు కొందరు సహాయ వైద్యాధికారులు, పర్యావరణ ఇంజినీర్లు లంచం తీసుకుంటున్నారు. సంపన్నుల కాలనీలు, గేటెడ్ కమ్యూనిటీల కేటాయింపు కోసం ఆటో సంఘాల నేతలు పోటీ పడుతున్నారు. ఆయా చర్యలతో ఇంటింటి చెత్త సేకరణ అధ్వానంగా మారుతోంది. సంపన్న కాలనీల్లో చెత్త సేకరణ రోజువారీ జరుగుతుండగా బస్తీల్లో 3–5 రోజులకోసారి జరుగుతోంది. ఫలితంగా ఇంట్లో పేరుకుపోయే వ్యర్థాలు వీధుల్లో పడుతున్నాయి.

పనిచేయని క్యూఆర్ కోడ్ హాజరు

ప్రస్తుతం వాటి సంఖ్య 4,500. అవన్నీ రోజూ విధుల్లో పాల్గొంటున్నాయా, లేదా అని తెలుసుకునేందుకు జీహెచ్ఎంసీ క్యూఆర్ కోడ్ హాజరు విధానాన్ని అందుబాటులోకి తెచ్చింది. ఆ ప్రాంతానికి సంబంధించిన శానిటరీ ఫీల్డ్ అసిస్టెంట్(ఎస్ఎఫ్ఏ) ఉదయాన్నే పారిశుధ్య కార్మికుల హాజరుతోపాటు స్వచ్ఛ ఆటో ట్రాలీపై ఉండే క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి హాజరు వేస్తారు. ఉదయం ఎస్ఎఫ్ఏ వద్ద హాజరు వేయించుకున్న కొన్ని ఆటోలు.. వ్యర్థాల తరలింపు కేంద్రాల్లో నమోదయ్యే హాజరులో కనిపించడం లేదు. దాంతో హాజరులో గోల్‌మాల్ జరుగుతోం




దనే అనుమానాలున్నాయి.

కట్నం కింద..

ఇంటింటి చెత్త సేకరణను చాలా కుటుంబాలు ఆస్తిగా భావిస్తుంటాయి. ఈ క్రమంలో కొన్ని కుటుంబాలు వివాహాల్లో ఆటోను, ఆటో విధులు నిర్వర్తించాల్సిన ప్రాంతాన్ని కట్నం కింద ఇస్తున్నారట. స్వచ్ఛ ఆటోలపై వేలాది కుటుంబాలు ఆధారపడ్డాయి. దీంతో ఆ పనులను రాంకీకి అప్పగించాలనుకుంటున్నారు.

నగరంలోని ఇళ్ల సంఖ్య 20 లక్షలు. ఒక్కో ఆటోకు 400–600 ఇళ్లు కేటాయించాలి. కానీ కొన్ని సంపన్న కాలనీల్లో 2 వేల ఇళ్లను ఒకే ఆటోకు కేటాయించారు. కొన్ని చోట్ల 200 ఇళ్లకు ఓ ఆటో ఉంది. ఈ విధమైన వ్యత్యాసాలతో పారిశుధ్యం గాడితప్పుతోంది. ఉన్నతాధికారులకు ఈ విషయంపై అవగాహన ఉన్నప్పటికీ చర్యలు తీసుకోవట్లేదనే విమర్శలున్నాయి.

# ఓఆర్ఆర్‌లో సర్వీసు రోడ్ల.. దుస్థితి చూడతరమా!

హైదరాబాద్: ఔటర్ రింగ్ రోడ్డులో కీలకమైన సర్వీసు రహదారుల నిర్వహణ పలు ప్రాంతాల్లో అధ్వానంగా మారింది. ఔటర్ రింగ్ రోడ్డును ప్రైవేటు సంస్థకు 30ఏళ్లకు లీజుకిచ్చిన అధికారులు సర్వీసు రోడ్లను మాత్రం హెచ్ఎండీఏ పరిధిలోని హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్(హెచ్‌జీసీఎల్)కు అప్పగించారు. లీజుకు తీసుకున్న సంస్థ.. హెచ్‌జీసీఎల్ అధికారులు సర్వీసు రోడ్లను పట్టించుకోకపోవడంతో వాహనదారులకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. నార్సింగి, మంచిరేవుల, కోకాపేట్, శంషాబాద్, ఘట్‌కేసర్...ఇలా పలు ప్రాంతాల్లో సర్వీసు రహదారులు వాహనదారులను భయపెడుతున్నాయి. సమీప గ్రామాలకు వెళ్లేవారికి ఈ సర్వీసు రోడ్లే దిక్కు. ఔటర్‌పై నుంచి నిత్యం 1.5 లక్షల వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. సర్వీసు రోడ్లపై అదనంగా మరో 50–60 వేల వాహనాలు తిరుగుతుంటాయి. మంచిరేవుల నుంచి గ్రేహౌండ్స్ వెళ్లే దారిలో ఔటర్ బ్రిడ్జి కింద అనేక గుంతలు పడి ద్విచక్ర వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి వేళలో గుంతలు కనిపించక అదుపుతప్పి పడిపోతున్నారు. రోడ్డుపై పలుచోట్ల ఇసుక, మట్టి పేరుకుపోయి వాహనాలు స్కిడ్ అవుతున్నాయి. మొత్తం సర్వీసు రహదారుల్లో 14ప్రాంతాల్లో లింకులు కూడా లేవు. ఇందులో మూడు ప్రాంతాల్లో రైల్వే లైన్లు ఉండటంతో అక్కడ వంతెనల నిర్మాణం చేపట్టాల్సి ఉంది. ఔటర్‌పై టోల్ వసూలు చేస్తున్న ప్రైవేటు సంస్థకు



సర్వీసు రోడ్ల బాధ్యత అప్పజెప్పకపోవడంతోనే ఈ పరిస్థితి ఏర్పడిందనే ఆరోపణలున్నాయి.

పచ్చదనం నిర్వహణ సైతం హెచ్‌జీసీఎల్‌దే..

ఔటర్ రింగ్ రోడ్డు మధ్యలో పచ్చదనం పెంచుతున్నారు. జంక్షన్ల వద్ద కూడా పచ్చదనం అభివృద్ధి చేశారు. డ్రిప్ ఇరిగేషన్ ద్వారా మొక్కలు తడుపుతున్నారు. ఇందుకు హెచ్‌జీసీఎల్‌కు ఏటా రూ. 14–20 కోట్లు ఖర్చు అవుతోంది. ఓఆర్ఆర్ లీజుకు తీసుకున్న సంస్థకు పచ్చదనం నిర్వహణ అప్పగించకుండా హెచ్‌జీసీఎల్ తన వద్దే పెట్టుకోవడంతో అప్పట్లో విమర్శలు వచ్చాయి. ప్రస్తుతం సిబ్బందికి జీతాల చెల్లింపులో జాప్యంతో పనికి సక్రమంగా రావడం లేదని, పచ్చదనం నిర్వహణ కూడా అంతంతమాత్రంగా ఉండటున్నారు. ఎండలు మండుతున్న నేపథ్యంలో నిర్వహణ సక్రమంగా లేకపోతే పచ్చదనం దెబ్బతినే అవకాశం ఉంది. దీనిపై దృష్టి సారించాలి.

# గవద బిళ్లల టీకాకు దూరం!

హైదరాబాద్: తొలినాళ్ల నుంచి ప్రభుత్వ ఉచిత టీకా కార్యక్రమంలో మంప్స్(గవద బిళ్లలు) టీకా (ఎంఎంఆర్) లేకపోవడంతో సమస్య ఏర్పడింది. కేవలం మీజిల్స్, రుబెల్లా(ఎంఆర్) మాత్రమే పిల్లలకు అందిస్తున్నారు. మంప్స్ టీకా కావాలంటే ప్రైవేటులో డబ్బు చెల్లించాల్సిందే. గవద బిళ్లల సమస్య ప్రాణాంతకం కాకపోవడం, ప్రజారోగ్య ప్రాధాన్య వ్యాధిగా పరిగణించకపోవడంతో ప్రభుత్వ టీకా కార్యక్రమంలో చేర్చలేదు. ఇది చలికాలంలో ఒకరి నుంచి ఒకరికి వ్యాపిస్తుంది. నిలోఫర్, ఫీవర్ ఆసుపత్రులకు నిత్యం ఒకరిద్దరు వస్తున్నారు. 5–15 ఏళ్ల పిల్లల్లోనే సమస్య కనిపిస్తుంది. దగ్గు, జలుబు, లాలాజల గ్రంథుల వాపుతో రెండు వైపుల దవడలు పెద్దవిగా కన్పిస్తాయి. బాలికల్లో పొత్తి కడుపు నొప్పి ఉంటుంది. కొందరిలో మెదడు, ప్రాంకియాస్, చెవులు, జననాంగాలకు ఇన్ఫెక్షన్ సోకి వ్యాధి తీవ్రమవుతుంది. రెండు వారాల తర్వాత తగ్గిపోతుంది.

# దూరమే అసలు పరీక్ష




ధారూర్: పదో తరగతి పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో జిల్లాలోని ఆయా మండలాల్లో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలను పరిశీలించింది. కొన్ని చోట్ల ప్రహరీలు, మరుగుదొడ్లు, మూత్రశాలలు సరిగా లేవు. కేంద్రాలకు గ్రామాలకు దూరంగా ఉండడంతో, సమయానికి చేరుకునేందుకు రవాణా సౌకర్యం లేదన్న అంశాలు దృష్టికి వచ్చాయి. ఆలాంటి కేంద్రాలకు బస్సు సౌకర్యం కల్పిస్తే మేలు.

ప్రైవేట్ వాహనాలే దిక్కు

ధారూర్ మండల పరిధిలో కెరెల్లి, ధారూర్ ఉన్నత పాఠశాలల్లో కేంద్రాలను ఏర్పాటు చేసి, వసతులు కల్పించారు. తరిగోపుల, మోమిన్ కలాన్ గ్రామాల నుంచి కెరెల్లికి 19 కిలోమీటర్లు, ధారూర్‌కు 12 కిలోమీటర్ల దూరం విద్యార్థులు ప్రయాణించాలి. వీరికి బస్సు సౌకర్యం లేదు. నాగారం, నాగసమందర్ గ్రామాల నుంచి కెరెల్లికి 15 కిలోమీటర్లు, ధారూర్ 10 కిలోమీటర్లు రావాలి. వీరికి కూడా బస్సు సౌకర్యం లేదు.

ఉదయం 7 గంటలకు ఒకే బస్సు

మండలంలో మోమిన్‌పేట బాలుర ఉన్నత పాఠశాల, ఉర్దూ మాధ్యమం ఉన్నత పాఠశాల, ఎన్కతల ఉన్నత పాఠశాలలో కేంద్రాలు ఏర్పాటు చేశారు. మేకవనంపల్లి, కోల్కుంద, వెల్చాల్, మోమిన్‌పేట, మొరంగపల్లి గ్రామాల విద్యార్థులు ఎన్కతల పరీక్ష కేంద్రానికి వెళ్లాల్సి ఉంటుంది. వీరంతా మోమిన్‌పేటకు చేరుకుని ఎన్కతల వెళ్లాలి. ఉదయం 7గంటలకు ఒకే బస్సు ఉంది. ఆ తర్వాత బస్సు సౌకర్యం లేదు.

రవాణా సౌకర్యం కల్పిస్తే మేలు

మండల వ్యాప్తంగా 923 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రెండు, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో రెండు, జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఒక కేంద్రం ఏర్పాటు చేశారు. బాలుర ఉన్నత పాఠశాలలో ప్రహరీ లేదు. మండలంలోని కేంద్రానికి రుద్రారం, నాగారం, పాటీబీదిపల్లి, అన్నారం, టేకుల్‌కోడ్, లక్ష్మీపల్లి, సంగాయిపల్లి, చిట్లపల్లి గ్రామాల నుంచి రావాలి. అయితే బస్సు సౌకర్యం సరిగా లేదు. సుమారు 20 కి.మీ నుంచి 25 కి.మీ దూరం వరకు ఈ గ్రామాలున్నాయి. ఉదయం ఒక్క బస్సు మాత్రమే ఈ ప్రాంతాల నుంచి వస్తోంది.

ఇబ్బందులు తప్పవిక

కుల్కచర్ల, చౌడాపూర్ మండలాల్లో మరికల్, చౌడాపూర్ ముజాహిద్ పూర్, పుట్టపహడ్, కుల్కచర్ల బాలురు, కుల్కచర్ల బాలికల ఉన్నత పాఠశాలల్లో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. 1090 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు అవుతున్నారు. కేంద్రాల్లో విద్యుత్ సౌకర్యం, పంకాలు. తాగునీటి వసతి కల్పించినా, మూత్రశాలలు, మరుగుదొడ్ల నిర్వహణ సరిగాలేదు. కుల్కచర్ల బాలుర ఉన్నత పాఠశాలలో వినియోగానికి అనువుగా లేవు.

శౌచాలయాలు అస్తవ్యస్తం

దోమ మండలంలో దాదాపూర్, దోమ బాలుర, బాలిక ఉన్నత పాఠశాలల్లో కేంద్రాలు ఏర్పాటు చేశారు. మొత్తం 517 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. దోమ బాలికల ఉన్నత పాఠాశాలలో శౌచాలయాలు సరిగా లేవు. దాదాపూర్ కేంద్రంలో విద్యుత్ సౌకర్యం లేక. పంకాలు ఏర్పాటు చేయలేదు. బడెంపల్లి, మైలారం, దోర్నాల్‌పల్లి, బొంపల్లి తండా, రాకొండ, బట్లచందారం గ్రామాల నుంచి కేంద్రాలకు రావాలంటే బస్సు సౌకర్యం లేదు.

వసతుల ఏర్పాటు.. పకడ్బందీ చర్యల

మండలం, పట్టణ పరిధిలో మొత్తం 14 కేంద్రాలను ఏర్పాటు చేశారు. పది కేంద్రాలు పట్టణంలోనే ఏర్పాటయ్యాయి. ఆయా కేంద్రాల్లో 2,416 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. కేంద్రాల్లో వసతులు కల్పించారు. మండల విద్యాధికారి వెంకటయ్య శుక్రవారం పరిశీలించారు. తాగు నీరు, విద్యుత్, పంకాలు, శౌచాలయాలు వంటి వసతులు కల్పించారు. కేంద్రాల కార్యాలయాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి, జిల్లా పాలనాధికారి కార్యాలయానికి అనుసంధానం చేశారు.

కేంద్రాల్లో సదుపాయాల కల్పనపై అధికారులు దృష్టి సారించారు. తాగునీరు, పంకాల ఏర్పాటు చేస్తున్నారు. పరిగి మండలంలో 9పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. 1009 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కానున్నారు. చీకటి గదులు ఉన్న ప్రాంతాల్లో ట్యూబ్‌లైట్లు ఏర్పాటు చేస్తున్నారు. జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత బాలుర పాఠశాలలో అన్ని ఏర్పాట్లు చేశారు.

కేంద్రాలను పరిశీలించి సదుపాయాలను కల్పిస్తాం

రేణుకాదేవి, జ్లి విద్యాధికారిణి

జిల్లాలో పదో తరగతి అన్ని పరీక్షా కేంద్రాల్లో మౌలిక సదుపాయాలున్నాయి. ఒకటి రెండు కేంద్రాల్లో శౌచాలయాల్లో నీటి సదుపాయం లేకపోవచ్చు. వీటికి నీటి వసతి కల్పిస్తాం. పంకాలు లేని కేంద్రాల్లో ఏర్పాటు చేస్తాం. పరీక్షలు ప్రారంభానికి మరో రెండు రోజుల సమయం ఉన్నందున సమస్యలను పరిష్కరిస్తాం.

# పట్టణ ప్రగతికి.. కొత్త ప్రణాళిక



వికారాబాద్ : పట్టణాల అభివృద్ధికి పక్కా ప్రణాళికతో ముందుకు సాగాలని సర్కారు యోచిస్తోంది. ఈ నేపథ్యంలోనే నూతనంగా బృహత్ ప్రణాళిక కార్యాచరణ తయారు చేయాలని ఆదేశాలు జారీ చేసింది. ఈ బాధ్యతను పట్టణ ప్రణాళిక విభాగానికి అప్పగించారు. జిల్లాలోని నాలుగు పురపాలికల్లో రెండు వికారాబాద్, తాండూరు పాతవి, పరిగి, కొడంగల్ కొత్తగా ఏర్పాటు చేశారు. అంతేకాకుండా పొరుగున ఉన్న గ్రామాలను పురపాలికల్లో విలీనం చేయడంతో విస్తీర్ణం, జనాభా పెరిగింది. వికారాబాద్ పురపాలికలో ధన్నారం, కొంపల్లి, గిరిగిట్‌పల్లి, బూర్గుపల్లి, మద్గుల్‌చిట్టెంపల్లి, గుడుపల్లి గ్రామాలను విలీనం చేశారు. వీటిల్లో మౌలిక వసతులు అంతంత మాత్రంగానే ఉన్నాయి. పట్టణంలో భూగర్భ కాల్వలు ఉండగా, విలీనమైన పంచాయతీల్లో మురికి కాల్వలు అస్తవ్యస్తంగా ఉన్నాయి. తాండూరు పురపాలికలో సమీపంలో ఉన్న గ్రామాలను విలీనం చేశారు. పట్టణంలోని కొన్ని కాలనీల్లో రోడ్లు ఇరుకుగా ఉన్నాయి. పరిగిలో భూగర్భ మురుగు కాలువ పథకం ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. కొడంగల్ పురపాలికలో సమస్యలు ఎక్కువే. వికారాబాద్ పురపాలికలో మాస్టర్ ప్లాన్ రూపొందించారు. అధికారులు ఆమోదించాల్సి ఉంది.

ప్రయోజనాలు ఇలా: పురపాలికల్లో బృహత్ ప్రణాళిక అమలులోకి వస్తే పట్టణాల అభివృద్ధి వేగవంతం అవుతోంది. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా పట్టణాల్లో అంచనాలను తయారు చేస్తారు. మరో 50 ఏళ్లకు అనుగుణంగా ప్రణాళిక ఉంటుంది. పట్టణాన్ని నివాస, వాణిజ్య, పారిశ్రామిక జోన్లుగా విభజిస్తారు. అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకుంటారు. ప్రధాన రహదారులు ఏర్పాటు చేసి, అనుసంధాన నడకదారులకు స్థలం కేటాయిస్తారు. పచ్చదనం పెంచేందుకు అనువుగా ఉండే ప్రాంతాలను ఎంపిక చేసి ప్రకృతి వనాలు, పార్కుల ఏర్పాటుకు స్థలాలను గుర్తిస్తారు. సమీకృత మార్కెట్లు, క్రీడా ప్రాంగణాలు, పార్కుల ఏర్పాటుకు స్థలం కేటాయించి, నూతన ఇళ్లకు కొత్త విధానం ప్రకారం అనుమతి ఇస్తారు. నాలుగు నెలల్లో కొత్త విధానాన్ని పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారు.

# శిరస్త్రాణం ప్రాణానికి అభయం

ఇందూర్ : మానవ శరీరంలో అత్యంత ముఖ్యమైన భాగం తల.. ఇది శరీరాన్ని నియంత్రణలో ఉంచుతుంది. ప్రయాణ సమయంలో అటువంటి ప్రధానమైన భాగానికి రక్షణగా నిలిచే కవచం శిరస్త్రాణం. కానీ దానిని మరుస్తున్న వాహనదారులు ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. ఎన్ని విధాలుగా ప్రచారాలు చేసినా ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే వారు బాధ్యతను మరిచి భద్రతను పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. జిల్లాలో రోడ్డు ప్రమాదాల బారినపడి ఇంటి పెద్ద దిక్కును కోల్పోయిన వారు ఎందరో ఉన్నారు. 'నాకేమీ కాదు.. జాగ్రత్త గానే ఉంటాను' అనే ధీమా వారి, వారి కుటుంబ సభ్యుల జీవితాల్లో చీకటి నింపుతుంది. పోలీసులు, సామాజిక కార్యకర్తలు ఎన్ని ప్రచారాలు చేస్తున్నా.. జిల్లాలో రోజూ ఏదో ఒక చోట ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నా.. శిరస్త్రాణం అవసరాన్ని అధికశాతం గుర్తించడం లేదు.కుటుంబీకుల బాధ్యత ద్విచక్రవాహనంపై బయటకు వెళ్తున్న తండ్రి, భర్త, సోదరులకు శిరస్త్రాణం మర్చిపోకుండా అందించే బాధ్యత కుటుంబ సభ్యులకు ఉంది. హెల్మెట్ లేకుండా బయటకు వెళ్లవద్దని వారించాలి.తలకు గాయంతో మృతి.. నవీపేటకు చెందిన పట్లే సాయిరెడ్డి వ్యక్తిగత పనుల కోసం నిజామాబాద్ వచ్చారు. పని పూర్తి చేసుకుని తిరిగి ఇంటికి వెళ్తున్న క్రమంలో సారంగాపూర్ వద్ద ఆటో ఢీకొనడంతో తలకు తీవ్ర గాయమై ఘటనా స్థలంలోనే మృతిచెందారు. ఆ సందర్భంలో ఆయన హెల్మెట్ ధరించి ఉంటే బతికేవారు.

కానిస్టేబుల్..బోధన్ రోడ్డులో రెండు రోజుల కిందట రోడ్డు ప్రమాదానికి గురై ఆర్మ్‌డ్ రిజర్వు విభాగం కానిస్టేబుల్ పల్లె శంకర్ చికిత్స పొందుతూ మృతిచెందారు. రోడ్డు ప్రమాదం జరిగిన సందర్భంలో ఆయన శిరస్త్రాణం ధరించలేదు.

# సవరణలకు.. ఉరుకులు పరుగులు!

ఆసిఫాబాద్ : ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమల్లోకి తెచ్చిన ఉచిత విద్యుత్తు, రూ.500కే వంట గ్యాస్ పథకాలు అందక పలువురు దరఖాస్తుదారులు హైరానా పడుతున్నారు. పొరపాట్ల సవరణ కోసం ప్రజాపాలన సేవా కేంద్రాలు తెరిచినా.. కొందరి వివరాలు అంతర్జాలంలో కనిపించకపోవడంతో వారు ఆందోళన చెందుతున్నారు. మళ్లీ ప్రభుత్వం దరఖాస్తులు కోరే వరకు వేచి చూడాలని చెబుతుండడంతో అయోమయానికి గురవుతున్నారు.

200 యూనిట్ల లోపు వాడుకునే వారికి ఉచిత విద్యుత్తు, రూ.500లకు వంట గ్యాస్‌ను ఈ నెల మొదటి నుంచి ప్రారంభించింది. కొందరికి జీరో బిల్లులు వచ్చినా.. అర్హత ఉన్నా చాలా మందికి అమలుకాలేదు. రూ.500 లకు గ్యాస్ సైతం చాలా మందికి రాలేదు. దరఖాస్తుల్లో, కంప్యూటరీకరణలో జరిగిన పొరపాట్లను సవరించి అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అమలు చేయాలన్న ఉద్దేశంతో.. అన్ని మండలాల్లోని ఎంపీడీవో కార్యాలయాలు, పురపాలిక సంఘాల్లో ప్రజాపాలన కేంద్రాలు ఏర్పాటు చేసి ప్రత్యేక సిబ్బందిని నియమించారు. అర్హత ఉండి జీరో బిల్లు రాక, రాయితీ గ్యాస్ రాని వారు ఇక్కడ సంప్రదిస్తే సవరణ చేసి రసీదు అందిస్తారు. దానిని సంబంధిత విద్యుత్తు కార్యాలయం, గ్యాస్ ఏజెన్సీలో అందించి సంక్షేమ పథకాల లబ్ధి పొందవచ్చు.

అంతర్జాలంలో చూపక ఆందోళన..

దరఖాస్తుల్లో సక్రమంగా వివరాలు నమోదు చేయకపోవడం, ఆధార్, రేషన్ నంబర్లు తప్పుగా వేయడం, అనుసంధానం కాకపోవడం, ఎఫ్ఎస్‌సీ(ఫుడ్ సెక్యూరిటీ కార్డు) నంబర్‌కు బదులుగా కొందరు పాత రేషన్ కార్డు నమోదు చేయడం, విద్యుత్తు మీటర్ సంఖ్య తప్పుగా



నమోదు చేయడం.. ఇలా అనేక పొరపాట్లు జరిగాయి. ఈ కేంద్రాలకు వచ్చి పొరపాట్లను సవరించుకోవడంతో అర్హులుగా మారుతున్నారు. అయితే రూ.500 లకు గ్యాస్ కోసం గతంలో దరఖాస్తులో గ్యాస్ కనెక్షన్ నంబర్ కోరారు. కానీ ఇప్పుడు 16 అంకెల కస్టమర్ ఐడీ అడుగుతుండటంతో.. చాలా మంది దీనికోసం సంబంధిత గ్యాస్ ఏజెన్సీల వద్దకు పరుగులు తీస్తున్నారు. ఆ వివరాలతో మళ్లీ కేంద్రాలకు వచ్చి నమోదు చేయిస్తున్నా.. కొందరే అర్హత సాధిస్తున్నారు. ఈకేవైసీ నమోదు చేసుకోని వారి వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు కావడం లేదు. దీనికి కారణాలు మాత్రం అధికారులు సైతం చెప్పలేకపోతున్నారు. కొందరి దరఖాస్తుల వివరాలు అంతర్జాలంలో కనిపించడంలేదు. గత ప్రజాపాలనలో దరఖాస్తు చేసిన రసీదులతో వస్తున్నా.. అంతర్జాలంలో వివరాలు చూపించకుండా 'డేటా నాట్ ఫౌండ్' అని కనిపిస్తోంది. మళ్లీ కొత్తగా వివరాలు నమోదుకు అవకాశం కల్పించలేదు. ఇలాంటి వారు ఎవరిని సంప్రదించాలో తెలియక అయోమయానికి గురవుతున్నారు.మళ్లీ దరఖాస్తు చేసే వీలు లేదట

కుడ్మెత మెంగు మాది ఆసిఫాబాద్ మండలం రింగన్‌గూడ. ప్రజాపాలనలో నాలుగు పథకాలకు దరఖాస్తు చేశా. ఉచిత విద్యుత్తు, రూ.500 గ్యాస్ మాకు అమలుకాలేదు. ప్రజాపాలనలో దరఖాస్తు చేసిన రసీదుతో జిల్లా కేంద్రంలోని ప్రజాపాలన సేవా కేంద్రానికి వస్తే మా వివరాలు నమోదు కానట్లు చూపుతోంది. మళ్లీ దరఖాస్తు చేసే వీలు లేదట. మరి మా పరిస్థితి ఏంటి. పొరపాటు ఎవరిది. అధికారులే చెప్పాలి.

# వృథా అరికట్టకుంటే వృథే!

చేర్యాల : వందల కిలోమీటర్ల నుంచి నీటిని విద్యుత్తు మోటార్ల ద్వారా తరలించి, తాగడానికి అనుకూలంగా మార్చి రూ.లక్షలు ఖర్చు చేస్తూ ప్రజలకు శుద్ధజలాన్ని భగీరథ పథకం కింద అందిస్తుంటే.. అధికారులు, నిర్వాహకుల నిర్లక్ష్యం కారణంగా నేల పాలవుతోంది. ప్రస్తుత వేసవిలో భూగర్భ జలమట్టం తగ్గడం వల్ల నీటి ఎద్దడి ఏర్పడే అవకాశం ఉంది. నీటిని పొదుపుగా వాడితే, నీటి కష్టాలు చాలా వరకు తగ్గుతాయి. చాలా ప్రాంతాల్లో నీటి అవసరాలు తీరగానే కుళాయిలను ఆపేయకుండా అలాగే వదిలిపెడుతుండటంతో నీరంతా వృథాగా పోతోంది. నీటి ప్రాధాన్యతపై అధికారులు ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. దీనిపై పరిశీలనాత్మక కథనం.30శాతం జలం నిరుపయోగం

హుస్నాబాద్ పురపాలక పరిధిలో మిషన్ భగీరథకు సంబంధించి 7,250కు పైగా నల్లా కనెక్షన్లు ఉన్నాయి. గతంలో ఉన్న రక్షిత నీటిసరఫరా పథకానికి సంబంధించి మూడు వేలకుపైగా కనెక్షన్లు ఉన్నాయి. ఈ రెండు పథకాల ద్వారా నీటి సరఫరా జరుగుతోంది. పట్టణంలో రోజుకు 35లక్షల లీటర్ల నీటిని ఇంటింటికి సరఫరా చేస్తున్నారు. ఇందులో దాదాపు 30శాతం నీరు వృథా అవుతోంది. దాదాపు 10లక్షల లీటర్ల నీరు పోతున్నట్లు అంచనా. నల్లా కనెక్షన్లు ఇచ్చినప్పుడు ఇనుప పైపు నల్లాలను అమర్చారు. అవి తుప్పు పట్టడంతో చాలా ఇళ్లలో వీటిని తొలగించారు. నీరు అవసరం ఉన్నప్పుడు పట్టుకొని మిగతా నీరు వృథాగా వదిలేస్తున్నారు. మరికొందరు మురుగు కాలువల్లో నీటిపైపును పడేస్తున్నారు.

నల్లాలు తీసేసి.. అలాగే వదిలేసి..

గత ప్రభుత్వం దాదాపు రూ.వెయ్యి కోట్లు ఖర్చు చేసి గజ్వేల్ మండలం కోమటిబండ గుట్టపై మిషన్ భగీరథ పథకాన్ని ఏర్పాటు చేసింది. గజ్వేల్–ప్రజ్ఞాపూర్, తుప్రాన్ మున్సిపాలిటీలతో పాటు గజ్వేల్, తూప్రాన్ గ్రామీణ, ములుగు, వర్గల్, మనోహరాబాద్, జగదేవపూర్, మర్కూక్, కొండపాక, కుకునూర్‌పల్లి తదితర మండలాల పరిధిలోని 244 ఆవాసాల్లో 64వేల ఇళ్లకు నీటిని సరఫరా చేస్తున్నారు. ప్రతి రోజు 30వేల లీటర్ల నీటిని సరఫరా చేస్తున్నారు. చాలా చోట్ల నల్లాలు తీసేశారు. గజ్వేల్, ప్రజ్ఞాపూర్ పలు వార్డుల్లో, జగదేవపూర్ మండలం, వర్గల్ మండలంలోని నాచారంతోపాటు ఇతర గ్రామాల్లో నీరు వృథాగా పోతుంది.

నెలకు రూ.5లక్షల విద్యుత్తు బిల్లు

దుబ్బాక పురపాలికలో దాదాపు 6 వేల భగీరథ నీటి కనెక్షన్లు ఉన్నాయి. వీటికి ప్రభుత్వం ఉచితంగా నల్లాలు బిగించినప్పటికీ, ప్రజలు వాటిని తొలగించి, అవసరం మేరకు నీటిని పట్టుకొని.. మిగతా నీటిని మురుగు కాల్వల్లోకి వదులుతున్నారు. దీనికి తోడు పలు వార్డుల్లో ఉన్న 50కి పైగా ప్రభుత్వ బోర్లు, వాటి పక్కనే నిర్మించిన చిన్న నీటి ట్యాంకుల వద్ద నీరు వృథా అవుతోంది. ట్యాంకుల నుంచి ఇళ్లలోకి పైపులను వేసుకొని నీటిని వాడుకుంటున్నారు. మరికొందరు ట్యాంకుల వద్దే దస్తులు ఉతుకుతూ తాగు నీటిని మురుగు కాల్వల పాలు చేస్తున్నారు. ఫలితంగా పురపాలికకు ప్రతి నెల దాదాపు రూ.5 లక్షల మేర విద్యుత్తు బిల్లు వస్తుందని సిబ్బంది తెలియజేశారు.

రెండేళ్లుగా లీకేజీ..

కొండపాక మండలం తిమ్మారెడ్డిపల్లి శివారులో సంప్‌హౌజ్ నుంచి జనగామ, పాలకుర్తి నియోజకవర్గాల్లోని పలు గ్రామాలకు నీటిని తరలించే ప్రధాన గొట్టాలు ఉన్నాయి. చేర్యాల తహసీల్దారు కార్యాలయానికి సమీపంలో గొట్టాలకు బిగించిన గేట్‌వాల్వు లీకై రెండేళ్లుగా నీరు పోతోంది. ఎంపీడీవో కార్యాలయం పక్కన ఉన్న ఉపరితల ట్యాంకు తరచూ నిండిపోయి నీరంతా వృథాగా పోతోంది. భగీరథ అధికారులకు సమాచారం ఇస్తే.. కేవలం ఏర్పాటు చేయడం వరకే మా బాధ్యత అని, నిర్వహణ బల్దియా, గ్రామపంచాయతీలదేనని తప్పించుకుంటారు. స్థానిక సంస్థలకు చెబితే మరమ్మతులకు కాలయాపన చేస్తున్నారు.




## బయటపడే మార్గమే లేదక్కా.. కౌంట్‌డౌన్ మొదలైంది!

ఢిల్లీ: ఎమ్మెల్సీ కవిత అరెస్టుపై జైలు నుంచి సుఖేశ్ చంద్రశేఖర్ సంచలన లేఖ రాశారు. ఇప్పటి వరకూ కవితను టార్గెట్ చేస్తూ ఆయన ఎన్నో లేఖలు విడుదల చేశారు. కవితకు.. తనకు మధ్య జరిగిన ఛాటింగ్ వివరాలను సైతం సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ఇన్నాళ్లుగా తప్పుడు కేసులు, తప్పుడు ఆరోపణలు, రాజకీయ కక్ష సాధింపు అంటూ చెప్పినవన్నీ అబద్ధాలని తేలింది. ఇన్నాళ్లకు నిజం బయటికొచ్చిందని.. చేసిన పనుల కర్మ ఫలం ఇప్పుడు వెంటాడుతోందని సుఖేష్ లేఖలో పేర్కొన్నారు. "నిజం శక్తి ఏంటో తెలుసుకోవాలి. ఎదుర్కోవాల్సి ఉంటుంది. నన్ను ఎవరూ ఏమి చేయలేరని అనుకునేవారు. కానీ కొత్త భారతదేశంలో చట్టమే అన్నింటికన్నా శక్తివంతమైంది. నేను గతంలో మీడియాకు విడుదల చేసిన లేఖల్లో 2 అంశాలు పొందుపరిచాను. అందులో ఒకటి తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమి పాలవుతుంది.. రెండోది తిహార్ క్లబ్‌లో చేరేందుకు కవితకు కౌంట్ డౌన్ మొదలైంది. ఈ రెండూ ఇప్పుడు నిజమయ్యాయని అనిపిస్తోంది. కవిత అరెస్టుతో అవినీతి పండోరా బాక్స్ ఓపెన్ అయింది. కవితతో పాటు ఆమె అవినీతి సహాయకులు, అవినీతి రాజు అరవింద్ కేజ్రీవాల్ చేసిన అక్రమాలన్నీ బయటపడతాయి.

**కేజ్రీ, సిసోడియాతో కవిత కుమ్మక్కు :** వేలాది కోట్ల రూపాయల ప్రజాధనం లూటీ చేసి సింగపూర్, హాంగ్‌కాంగ్, జర్మనీ వంటి దేశాలకు పంపిన విషయాలు బయటికొస్తాయి. ఇది ఎవరికి అర్థం కావాలో వారికి అర్థమైందని అనుకుంటున్నాను. అక్కా!..నేను వాట్సాప్ చాట్ స్క్రీన్ షాట్ల ద్వారా బయటపెట్టిన నెయ్యి డబ్బాల కథలు, రేంజ్ రోవర్ కలెక్షన్ కథలు, గోవా కథలు, కాంట్రాక్ట్ కథలు దర్యాప్తులో నిజమని తేలాయి. బయటపడే మార్గమే లేదు అక్కా. ఇప్పటికైనా నా విన్నపం ఒక్కటే.. అవినీతి సూత్రధారి అరవింద్ కేజ్రీవాల్‌ను కాపాడేందుకు నిజాన్ని దాచే ప్రయత్నం చేయవద్దు. ఎందుకంటే ఈ దేశ ప్రజలు, న్యాయస్థానాలు నిజం తెలుసుకున్నాయి. ఇందుకు కావాల్సినంత సాక్ష్యాలు, ఆధారాలు ఉన్నాయి.

**రూ.300 కోట్ల ఘరానా మోసం! :** ఏదేమైనా ఈడీ, సీబీఐ కన్‌ఫ్రంటేషన్ లో భాగంగా మిమ్మల్ని త్వరలోనే ముఖాముఖి చూస్తాను అక్కా.. మా గ్రేటెస్ట్ తిహార్ జైలుకు స్వాగతం అక్కా.. మీ మరో సోదరుడు, అవితిని సూత్రధారి అరవింద్ కేజ్రీవాల్ మీకు జైల్‌లో లగ్జరీ జీవితం అందంచేందుకు అన్ని ఏర్పాట్లు చేసి ఉంటారు. ఈ లేఖను ముగించే ముందు మరొక్క మాట చెప్పదల్చుకున్నా.. 'సినిమా ఇంకా మిగిలే ఉంది'. కేజ్రీవాల్ జీ.. తదుపరి ఇక మీరే. ఎంత ప్రయత్నించినా సాధ్యం కాదు. సినిమా క్లైమాక్స్‌కు చేరుకుంది. కేజ్రీవాల్ జీ.. నా సోదరసోదరీమణులకు తిహార్ క్లబ్‌కు స్వాగతం పలుకుతున్నాను" అని సుఖేష్ చంద్రశేఖర్ లేఖలో పేర్కొన్నారు.




నల్గొండ: రైల్వే పోలీసు కావాలన్నది ఆమె ఆకాంక్ష.. అందుకోసం 2018లో జరిగిన ఆర్పీఎఫ్ ఎస్సై పరీక్ష రాసింది. కంటి చూపు సరిగా లేకపోవడం ఆమె పాలిట శాపంగా మారింది. ఎలాగైనా తన తల్లిదండ్రులు, గ్రామస్థులను సంతృప్తి పరచడానికి పోలీసు అధికారిగా ప్రజల్లో చలామణి కావాలని నిర్ణయించుకుని ఆర్పీఎఫ్ ఎస్ఐ అవతారమెత్తింది. విధులకు వెళ్తున్నట్టు దాదాపు ఏడాది పాటు కుటుంబ సభ్యులు, గ్రామస్థులను నమ్మించింది. పెళ్లి చూపులకు కూడా అదే యూనిఫాంలో వెళ్లి కటకటాల పాలైంది. కేసు వివరాలను మంగళవారం రైల్వే ఎస్పీ సలీమా మీడియాకు వెల్లడించారు. నార్కట్‌పల్లికి చెందిన మాళవిక హైదరాబాద్‌లోని నిజాం కళాశాలలో డిగ్రీ పూర్తి చేసి ఆర్పీఎఫ్ ఎస్సై పరీక్షకు హాజరైంది. కంటి చూపు సరిగాలేక అర్హత సాధించలేకపోయింది. ఎలాగైనా తన తల్లితండ్రులు, గ్రామస్థుల ముందు పోలీస్‌గా చలామణి అవ్వాలని నిర్ణయించుకుంది. ఎల్బీ నగర్ ప్రాంతంలో ఆర్పీఎఫ్ పోలీసులు ధరించే యూనిఫాం కొనుగోలు చేసింది.

రైల్వే ఎస్సైగా నల్గొండ లో విధులు నిర్వహిస్తున్నట్లు దాదాపు ఏడాది పాటు ప్రజలను నమ్మించి మోసాలకు పాల్పడింది. దేవాలయాలకు వెళ్లి, ప్రముఖులను కలిసి ఫోటోలు దిగి ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టు చేసేది. చివరికి పెళ్లి చూపులకు కూడా అదే యూనిఫాంలో వెళ్లింది. అబ్బాయి తరపు బంధువులు ఆర్పీఎఫ్‌లో పై అధికారులను ఆరా తీయగా ఆమె అసలు గుట్టు బయట పడింది. వెంటనే అప్రమత్తమైన నల్గొండ ఆర్పీఎఫ్ సిబ్బంది మాళవికను అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా ఆమె మోసాల చిట్టా బయటపడింది. వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, విచారణలో మరిన్ని విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశముందని ఎస్పీ తెలిపారు.

## తెలంగాణాలో ద్రోణి ప్రభావం

### మూడురోజులపాటు గ్రేటర్ హైదరాబాద్ తోపాటు పలు జిల్లాల్లో వర్షాలు!!



హైదరాబాద్ : బంగాళాఖాతంలో ఏర్పడిన ద్రోణి ప్రభావంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనే కాకుండా తెలంగాణ రాష్ట్రంలో కూడా వర్షాలు కురుస్తున్నాయి. ఈ సీజన్ లో మార్చి నెల ఆరంభంలోనే మండుతున్న వేసవి నుండి ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు కాస్త ఉపశమనం కలిగించినప్పటికీ, ఈ వర్షాలు అన్నదాతలను ఆందోళనకు గురిచేస్తున్నాయి. పంట చేతికి వచ్చే సమయంలో కురుస్తున్న వర్షాలతో అన్నదాతలు ఆందోళన పడుతున్నారు. బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ద్రోణి కారణంగా రానున్న 24 గంటల్లో గ్రేటర్ హైదరాబాద్లో అక్కడక్కడ తేలికపాటి జల్లులు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ శాఖ పేర్కొంది. ఇక తెలంగాణ రాష్ట్రంలోనూ అత్యధిక జిల్లాలలో వర్షాలు కురుస్తాయని ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వడగళ్లవానలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం పేర్కొంది. మరో మూడు రోజులపాటు అనేక జిల్లాలలో ఒక మోస్తరువర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. ఇక ఇప్పటికే అనేక జిల్లాలలో తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు కురుస్తున్నాయి. దీంతో అన్నదాతలు పంటలు కాపాడుకోవడానికి పడరాని పాట్లు పడుతున్నారు. చేతికొచ్చిన వరి ధాన్యం నేల రాలుతుండగా, వర్షాల కారణంగా ఉద్యాన పంటలు కూడా దెబ్బతింటున్నాయి. ఇక అకాల వర్షాలు మామిడి రైతులను తీవ్ర ఆందోళనకు గురి చేస్తున్నాయి. అనేక ప్రాంతాలలో వడగళ్ల వానలు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. ఇక ఈరోజు తెల్లవారుజాము నుంచే హైదరాబాద్ నగరంలోని పలు ప్రాంతాలలో వర్షాలు కురుస్తున్నాయి. సంగారెడ్డి, కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాల్లో కూడా వర్షాలు కురుస్తున్నాయి.

హైదరాబాద్లోని దిల్సుఖ్ నగర్, చైతన్యపురి, కర్మాన్ ఘాట్, వనస్థలిపురం, ఎల్బీనగర్ నగర్, కోటి, హయత్ నగర్ వంటి చోట్ల వర్షాలు కురుస్తున్నాయి. మరో మూడు రోజులపాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరిస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించడం జరిగింది. ఈదురు గాలులతో కూడిన వర్షం అనేక ప్రాంతాలలో కురుస్తున్న కారణంగా అక్కడ రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతుంది.




## 'మా అమ్మను కలిసేందుకు అనుమతించండి'... కోర్టుకు కవిత అభ్యర్థన

న్యూఢిల్లీ, మార్చి 19: ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో అరెస్ట్ అయిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత ప్రస్తుతం ఈడీ కస్టడీలో ఉన్నారు. ఈ క్రమంలో "మా అమ్మను కలిసేందుకు అనుమతించండి" అంటూ న్యాయస్థానాన్ని కవిత అభ్యర్థించారు. తల్లితో పాటు కుమారులను కలుసుకునేందుకు కూడా అనుమతించాలని న్యాయస్థానాన్ని కోరారు. ఈ మేరకు రౌస్ అవెన్యూ కోర్టులో కవిత తరపు న్యాయవాదులు మంగళవారం పిటిషన్ దాఖలు చేశారు. కవిత అభ్యర్థనకు న్యాయస్థానం అంగీకారం తెలిపింది. తల్లి శోభ, కుమారులు ఆదిత్య, ఆర్య.. సోదరీమణులు అఖిల, సౌమ్య, వినుత.. సోదరుడు ప్రశాంత్ రెడ్డిలను కలుసుకునేందుకు న్యాయస్థానాన్ని కవిత అనుమతి కోరారు. ఈ క్రమంలో తల్లీ, కుమారులు, కుటుంబసభ్యులను కలిసేందుకు కవితను న్యాయస్థానం అనుమతించింది. అయితే.. ఈడీ కస్టడీకి అనుమతించిన శనివారం రోజు భర్త అనిల్, సోదరుడు కేటీఆర్, బావ హరీష్ రావు, కజిన్ బ్రదర్స్ పి శ్రీధర్, ప్రణీత్ కుమార్, పీఏ శరత్ చంద్రలను కలుసుకునేందుకు కోర్టు అంగీకరించిన విషయం తెలిసిందే. కస్టడీలో ఉన్న ఏడు రోజుల్లో ప్రతి రోజూ సాయంత్రం 6 నుంచి 7 గంటల మధ్య బంధువులను కలుసుకునేందుకు కవితకు న్యాయస్థానం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అయితే ఎక్కువ మందిని కలవడం వల్ల దర్యాప్తుకు ఆటంకం కలుగుతుందని ఈరోజు కవిత తాజా పిటిషన్‌పై విచారణ సందర్భంగా కోర్టు వ్యాఖ్యానించింది. దీంతో ముందుగా అనుమతించిన వారిలో కేటీఆర్ పేరుతో పాటు తల్లి, కుమారులు, సోదరీమణులు అఖిల, సౌమ్య, వినుత, సోదరుడు ప్రశాంత్ రెడ్డి కలిసేందుకు అనుమతించాలని కవిత తరపు న్యాయవాదులు తెలిపారు. దీంతో ఆ మేరకు న్యాయస్థానం అంగీకారం తెలిపింది.

## కాంగ్రెస్ ప్రభుత్వం కమ్మ సామాజిక వర్గానికి అండగా ఉండాలి: విద్యాసాగర్ రావు



నిజామాబాద్ జిల్లా: కమ్మ సామాజిక వర్గంలోని పేదలకు కమ్మ కార్పొరేషన్ ఎంతో ఉపయోగపడుతుందని తెలంగాణ కమ్మ ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు విద్యాసాగర్ రావు తెలిపారు. కమ్మ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసినందుకు సీఎం రేవంత్ రెడ్డి కి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా విద్యాసాగర్ రావు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం కమ్మ సామాజిక వర్గానికి అండగా ఉండాలని కోరారు. కమ్మ వారు రాజకీయాల్లోకి రావాలని సూచించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చిందని చెప్పారు. రేవంత్ రెడ్డి మంత్రివర్గంలో స్వేచ్ఛ ఉందని తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్బంధ పాలన కొనసాగించారని మండిపడ్డారు. కేసీఆర్ మంత్రివర్గంలో మంత్రులు రబ్బర్ స్టాంపులుగా పని చేశారని విద్యాసాగర్ రావు ధ్వజమెత్తారు.

## మావోయిస్టులకు గట్టి ఎదురుదెబ్బ.. నలుగురు అగ్ర నేతల హతం!



మావోయిస్టులకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. పోలీసులతో జరిగిన ఎన్కౌంటర్ లో నలుగురు మావోయిస్టులు మరణించారు. తెలంగాణ సరిహద్దు ప్రాంతమైన ఛత్తీస్ గఢ్– మహారాష్ట్ర సరిహద్దులోని గడ్చిరోలిలో మార్చి 19న తెల్లవారుజామున భారీ ఎన్కౌంటర్ చోటు చేసుకుంది. ఇందులో మావోయిస్టులకు భారీ న ష్టం వాటిల్లింది. ఈ ఎన్కౌంటర్ లో నలుగురు మావోయిస్టులు మృతి చెందారని తెలుస్తోంది. మరణించినవారిలో మావోయిస్టు అగ్రనేతలు డీవీసీ సభ్యుడు వర్గీష్ తోపాటు ప్లాటూన్ సభ్యులు మంగాతు, కురుసం రాజు, వెంకటేష్ ఉన్నారని చెబుతున్నారు. గడ్చిరోలిలోని అటవీ ప్రాంతంలో కూంబింగ్ చేస్తున్న పోలీసులకు మావోయిస్టులు ఎదురుకావడంతో ఈ కాల్పులు చోటు చేసుకున్నాయి. కాల్పుల్లో చనిపోయిన మావోయిస్టులపై రూ. 36 లక్షల రివార్డు ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. మిగిలిన మావోయిస్టుల కోసం పోలీసులు విస్తృతంగా కూంబింగ్ నిర్వహిస్తున్నారు. ఆపరేషన్‌లో భాగంగా పోలీసులు భారీగా పేలుడు పదార్థాలను సీజ్ చేశారు. సీ60 కమాండోలతో ఎన్కౌంటర్ జరిగింది. ఘటనా స్థలంలో ఏకే 47, ఒక కార్బైన్, రెండు పిస్టల్స్ తో సహా పెద్ద మొత్తంలో పేలుడు పదార్థాలను కమాండోలు స్వాధీనం చేసుకున్నారు. మావోయిస్టు మృతుల్లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు చెందిన మావోయిస్టు నేతలు ఉన్నారని చెబుతున్నారు.

కొమురం భీం – మంచిర్యాల డివిజన్ కమిటి సభ్యునిగా వర్గేష్ కొనసాగుతున్నాడని తెలుస్తోంది. గత ఐదేళ్లుగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో మావోయిస్టు పార్టీ బలోపేతం కోసం వర్గేష్ ప్రయత్నాలు చేస్తున్నారని సమాచారం. పోలీసుల నిర్బంధం విధించడంతో అతడు మహారాష్ట్ర కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్నాడు. అలాగే మరో మావో నేత మంగ్తు.. సిర్పూర్ –చెన్నూరు ఏరియా కమిటి సభ్యునిగా ఉన్నాడని చెబుతున్నారు. వీరితో పాటు వెంకటేష్, రాజు.. ప్లాటూన్ సభ్యులుగా ఉన్నారు. వీరి నలుగురిపై రూ.36 లక్షల రివార్డు ఉంది. ఈ నలుగురు మార్చి 18న ప్రాణహిత నది దాటి తమ రాష్ట్రంలోకి ప్రవేశించినట్టు మహారాష్ట్ర పోలీసులు ప్రకటించారు.

## భద్రాద్రి రామయ్య భక్తులకు శుభవార్త..




భద్రాద్రి రామాలయం అధికారులు కీలక నిర్ణయం తీసుకున్నారు. స్థానిక భక్తులను దృష్టిలో ఉంచుకుని ఉచిత దర్శనం అవకాశం కల్పించారు. ఈ నిర్ణయం మంగళవారం నుంచే అమల్లోకి రానుంది. అధికారుల నిర్ణయం ప్రకారం.. భద్రాచలం స్థానికులు తమ గుర్తింపు కార్డును చూపి.. రూ. 100 క్యూలైన్లలో ఉచితంగా ప్రవేశించవచ్చు. తద్వారా రామయ్యను ఉచితంగా దర్శించుకోవచ్చు. అయితే, ఇక్కడ ఒక కండీషన్ ఉంది. ప్రతి మంగళవారం, బుధవారం, గురువారం రోజుల్లో సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల వరకు మాత్రమే ఈ ఉచిత దర్శనం అవకాశం ఉంటుంది. మిగతా సమయాల్లో యధావిధంగా ఉంటాయి. ఈ విషయాన్ని ఆలయ ఈవో రామాదేవి వెల్లడించారు.

## కేసీఆర్ టార్గెట్ గానే ఇవన్నీ...



హైదరాబాద్, మార్చి 19: బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత అరెస్ట్‌ను మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ తీవ్రంగా ఖండించారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. కేసీఆర్ టార్గెట్‌గానే ఇవన్నీ జరుగుతున్నాయన్నారు. బ్యాంక్‌లకు లక్షల కోట్లు ఎగ్గొట్టి విదేశాలకు పారిపోయినవారున్నారని అన్నారు. అధికారంలో ఉన్నామని భయ భ్రాంతులకు గురిచేసి పార్టీలో చేర్చుకుంటామంటే కుదరదన్నారు. అసమానతలు, అణిచివేత ఉన్నందునే నక్సల్‌బరి నుంచి తెలంగాణ ఉద్యమం వరకు పుట్టుకొచ్చాయని చెప్పుకొచ్చారు. ఈ గడ్డపై మరో ఉద్యమం పుట్టడం ఖాయమన్నారు. అన్ని వర్గాలను కడుపులో పెట్టుకుని కాపాడుకుంది కేసీఆర్ మాత్రమే అని శ్రీనివాస్‌గౌడ్ స్పష్టం చేశారు.

ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను...

తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో బ్యూరో ఇంచార్జీలు, స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జీలు, డివిజన్ ఇంచార్జీలతో పాటు మండల కేంద్రాల్లో విలేకరులు కావలెను. అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును. ఆసక్తి కలిగిన వారు సంప్రదించండి.

సయ్యద్ కరీం ఎడిటర్
9440977660, 9110718194

PRINTED, PUBLISHED, EDITED AND OWNED BY SYED. KAREEM. PRINTED AT MUZAMMIL PRINTERS BOKKALGUDA, ADILABAD-504001
PUBLISHED AT D.NO. 4-4-122/10/B, VIDYANAGER, ADILABAD - 504001. TELANGANA STATE, REGD. NO. APTEL/2011/41055 ìEDITOR : SYED. KAREEMî CELL - 94409 77660